సాక్షి
చిత్తూరు
సోమవారం। 14। జూలై। 2025




## కొండంత జనం
అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. - 8లో



## నిరాశ్రయుల 'వసతి' తనిఖీ
నిరాశ్రయుల వసతిగృహాన్ని మెప్మా డైరెక్టర్ ఆదివారం పరిశీలించారు. వసతి గృహానికి సహకారం అందిస్తామని తెలిపారు. - 8లో



## కారు దగ్ధం..తప్పిన ప్రమాదం
బంగారుపాళెం మండలంలో ఆదివారం పాలేరు ఫ్లైఓవర్ సమీపంలో కారు టైరు పేలి బోల్తాపడి దగ్ధమైంది. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా
**చిత్తూరు కలెక్టరేట్ :** నగరిలో అక్రమ గ్రావెల్ క్వారీలు, పలు సమస్యల పరిష్కారానికి ఈనెల 14న సీపీఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. నగరిలో అక్రమ గ్రావెల్ క్వారీలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గుండ్రాజకుప్పం దళితులు హైవేలో ఇళ్లు కోల్పోతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పలు డిమాండ్లు పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

### నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక
**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

### 22న మామిడి రైతు మహా జనసభ
**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** ప్రపంచ మామిడి దినోత్సవ సందర్భంగా ఈనెల 22న మామిడి రైతు మహా జనసభ నిర్వహిస్తున్నట్లు మామిడి రైతు సంక్షేమ సంఘం నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సభను ఏర్పాటు చేశామని, ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సంఘ సమావేశం ప్రారంభమవుతుందని, మామిడి రైతులు పాల్గొనాలని కోరారు.

### గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
**పెద్దపంజాణి :** మండలంలోని శంకర్రాయలపేటలోని మహాత్మా జ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాల (ఇంగ్లిష్ మీడియం)లో 2025–26 సంవత్సరానికి గానూ 5,6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జోత్స్న తెలిపారు. ఈనెల 20 ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్థానిక గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలకు వచ్చేవారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఈనెల 12 నుంచి 18వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 18వ తేదీ సాయంత్రం లోపు పాఠశాలలో అందజేసి హాల్ టికెట్ తీసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 95157 64818 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం.. తల్లులకు పరీక్షగా మారింది. పలు రకాల కారణాలతో పథకం అమలు కాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.. మొదటి జాబితాలో పథకం వర్తించని వారు రెండో జాబితాకు ఎదురు చూస్తున్నారు. అర్హులైనప్పటికీ అనర్హులని మొదటి విడత తల్లికి వందనంలో చాలా మంది విద్యార్థులకు పథకం ఎగ్గొట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేల మంది తల్లులకు తల్లికి వందనం అర్జీలతో సచివాలయాల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆ అర్జీలు పరిష్కారానికి నోచుకోక విద్యార్థుల తల్లులు...తిప్పలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా తల్లికి వందనం పథకం అర్జీలపై సాక్షి ఫోకస్.

సాక్షి ఫోకస్



చిత్తూరు సచివాలయంలో తల్లికి వందనం సమస్యల అర్జీలు ఇస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

# తల్లికి వందనం తిప్పలు!

- చిత్తూరు జిల్లాలో 1,890 అర్జీల నమోదు
- పరిష్కారానికి నోచుకోని 'తల్లికి వందనం' అర్జీలు
- సచివాలయాల చుట్టూ తల్లుల ప్రదక్షిణలు
- రెండో విడత మంజూరులో కాలయాపన

**జిల్లాలోని తల్లికి వందనం పథకంలో తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదంటూ చిత్తూరు అర్బన్‌లో 90, కుప్పం అర్బన్‌లో 28, కుప్పం రూరల్‌లో 28 మంది విద్యార్థుల తల్లులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ దరఖాస్తుల నమోదు చేసి నెల రోజులు అవుతున్నా మోక్షం కలగని దుస్థితి. ఇదే కాదు జిల్లాలోని అన్ని మండలాల్లో తల్లికి వందనం అర్జీల పరిష్కార పరిస్థితి ఇలానే ఉంది.**



పాలసముద్రం సచివాలయంలో అర్జీలు అందజేస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

**చిత్తూరు కలెక్టరేట్ :** కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం.. తల్లులకు పరీక్షగా మారింది. పలు రకాల కారణాలతో పథకం అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి జాబితాలో పథకం వర్తించని పిల్లలు రెండో జాబితాకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సచివాలయాల్లో గ్రీవెన్స్ స్వీకరించడంతో ఈ పథకంపై పెద్ద ఎత్తున అర్జీలను విద్యార్థుల తల్లులు అందజేశారు. ఎవరు ఏ సమస్య వల్ల అనర్హత జాబితాలో ఉన్నారో పేర్ల వారీగా వివరణ ఉన్న జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించారు. వాటి ఆధారంగా అవసరమైన పత్రాలను జత చేసి గ్రీవెన్స్‌కు అర్జీలు అందజేశారు. అయితే ఆ అర్జీలు వివిధ దశల్లో అధికారులు ఆమోదించాల్సి ఉండటంతో పరిష్కారానికి నోచుకోని దుస్థితి నెలకొంది.

### అర్హులైనా..అనర్హులుగా
తల్లికి వందనం పథకం అర్హత ఉన్నప్పటికీ గతంలో అమ్మఒడి పథకం పొందినప్పటికీ ఈ ఏటా అనర్హులుగా చూపించారు. అదే విధంగా చాలా మంది విద్యార్థుల తల్లులకు సంబంధం లేని సమస్యలను వారికి అంటగట్టి అనర్హులుగా జాబితాలో పెట్టారు. దీంతో జిల్లాలో తల్లికి వందనం వర్తింపజేయాలంటూ అర్జీలు సచివాలయాల్లో పోటెత్తాయి. తమకు అర్హత ఉన్నా పలు కారణాలతో జాబితాలో పేర్లు లేకుండా చేశారంటూ తల్లులు సచివాలయాలకు క్యూ కట్టి దరఖాస్తు చేసుకున్నారు. ఎప్పుడో కారు విక్రయించేసినా కారు ఉందనే సాకుతో పథకం నుంచి తొలగించారని కొందరు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు అధికంగా చూపడంతో డబ్బులు పడలేదని మరికొందరు.. మూడేళ్ల కింద ఆదాయపు పన్ను చూపించి డబ్బులివ్వలేదని ఇంకొందరు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు, రేషన్‌కార్డు సమస్యలున్న కుటుంబాలు ఇలా రకరకాల కారణాలతో తమను పథకానికి దూరం చేశారంటూ వాపోతున్నారు. అర్హులుగా నిర్ధారించి డబ్బులివ్వాలంటూ అధిక సంఖ్యలో తల్లులు అర్జీలు పెట్టుకున్నారు. దీంతో ఇప్పటి వరకు చిత్తూరు జిల్లాలో 1,890 మంది తల్లులు అధికారికంగా అర్జీలు దాఖలు చేశారు. వీరే కాకుండా అవగాహన లేక దరఖాస్తు చేసుకోవాల్సిన తల్లులు మరో వెయ్యి మంది ఉండొచ్చని అంచనా.

### జిల్లాలో 1,890 అర్జీలు నమోదు
జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,890 అర్జీలు పోటెత్తాయి. అర్జీల్లో ఎక్కువశాతం విద్యుత్ బిల్లుకు సంబంధించినవే. పథకం వర్తించని వారు విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి ఏడాది విద్యుత్ వినియోగ బిల్లులు తీసుకుని అర్జీలతో జత చేసి ఆధారాలు చూపుతూ అర్జీలు పెట్టుకుంటున్నారు. తమ పేరుపై అనేక విద్యుత్ మీటర్లు సీడింగ్ అయి ఉన్నాయని వాటిని తొలగించాలనే అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. తమ కారు విక్రయించేసినా పథకం అమలు కాలేదని అనేక అర్జీల్లో తల్లులు ప్రస్తావించారు. ఆదాయ పన్ను దరఖాస్తులదీ ఇదే తీరు. వివాహం తర్వాత తాము కుటుంబం నుంచి విడిపోయి విడిగా ఉంటున్నా ఉమ్మడి కుటుంబ సభ్యుల ఆదా యం చూపించి తీసేశారంటూ అర్జీల్లో అనేక మంది పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అనేక మంది అర్జీలు దాఖలు చేశారు.

### రెండవ విడతకు కాలయాపన
తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం జూన్ 13న అమలు చేసింది. నేటితో ఒక నెల పూర్తి అవుతోంది. చిత్తూరు జిల్లాలో 2,64,679 మంది విద్యార్థులకు సంబంధించి 1,30,382 మంది తల్లుల ఖాతాల్లో రూ.169.50 కోట్లు జమ చేశారు. అయితే మొదటి విడత మంజూరు కాని విద్యార్థులకు రెండో విడతలో పథకం నగదు జమ చేస్తామంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆర్భాటంగా చెప్పారు. మొదట రెండో విడత నగదును జులై 5వ తేదీన వేస్తామన్నారు. ఆ తర్వాత జులై 10వ తేదీ అన్నారు. ఈ రెండు తేదీలు గడిచిపోయినా ఇంకా నగదు జమ కాని దుస్థితి. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోందని విద్యార్థుల తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లా సమాచారం

| | నమోదైన అర్జీలు | పెండింగ్‌లో ఉన్న అర్జీలు |
|---|---|---|
| ప్రభుత్వ ఉద్యోగులం కాదంటూ | 581 | 577 |
| ఇన్‌కంట్యాక్స్ సమస్యలు | 263 | 260 |
| ఈకేవైసీ సమస్యలు | 1,046 | 1,026 |
| మొత్తం అర్జీలు | 1,890 | 1,863 |

### అర్జీల పరిశీలనలో అలసత్వం
తల్లికి వందనం పథకంలో వివిధ శాఖలకు పంపుతున్నా అర్జీల పరిశీలనలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కారుకు సంబంధించి జిల్లా రవాణా శాఖ, ఆదాయపు పన్ను అర్జీలను తహసీల్దార్, ఇలా పలు సమస్యల అర్జీలను ఆయా శాఖల అధికారుల లాగిన్‌లకు పంపారు. అయితే సంబంధిత అర్జీలు ఆయా అధికారుల లాగిన్‌లలో నెలలు గడుస్తున్నప్పటికీ ఆమోదానికి నోచుకోక అలానే పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వేల మంది తల్లులు అర్జీల పురోగతి కోసం నిత్యం సచివాలయాల చుట్టూ తిరిగి వేసారి పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులం కాదంటూ 581 అర్జీలు నమోదు అయ్యాయి. ఆ అర్జీలను మొదటగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా అక్కడ నుంచి వీఆర్‌వోకు, ఆ తర్వాత తహసీల్దార్, అనంతరం ఆర్డీవో, చివరికి జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయి. ఇలా నమోదైన 581 అర్జీల్లో ఇప్పటి వరకు కేవలం 4 అర్జీలు మాత్రం ఆమోదించారు. అదే విధంగా ఇన్‌కం ట్యాక్స్ సమస్యలపై 263 అర్జీలు నమోదయ్యాయి. ఈ అర్జీల్లో ఇప్పటి వరకు 3 అర్జీలు మాత్రం ఆమోదించారు.

### సర్కారు తీరు సరికాదు



తల్లికి వందనం పథకం ప్రతి ఒక్క విద్యార్థికి ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. ఒక కుటుంబంలో ముగ్గురు విద్యార్థులుంటే ఒక విద్యార్థికి మాత్రమే ఇచ్చి మిగిలిన పిల్లలకు కొర్రీల పేరుతో తొలగించారు. అదే విధంగా చాలా మందికి గతంలో అమ్మఒడి వర్తించినప్పటికీ ఇప్పుడు తల్లికి వందనం ఎందుకు వర్తించదో అర్థం కావడం లేదు. అర్జీలను పరిష్కరించడంలో వివిధ శాఖల అధికారులు అలసత్వం వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

## రాష్ట్రంలో ఆటవిక పాలన



శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

**పలమనేరు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విమర్శించారు. పలమనేరు పట్టణంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ బీసీ మహిళైన ఉప్పాల హారికపై గుడివాడలో టీడీపీ, జనసేన గుండాలు మారణాయుధాలతో దాడి చేయడం దారుణమన్నారు. మహిళ హోం మంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు చూసి సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ వ్యవహారం మొత్తం పోలీసుల సాక్షిగా జరుగుతున్నా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. జిల్లా ప్రథమ పౌరురాలకే పరిస్థితి ఇలా ఉంటే ఇక రాష్ట్రంలోని సామాన్య మహిళల పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చాలా అధ్వాన్నంగా ఉందన్నారు.

# ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం
- వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు రూరల్ మండలంలో రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి , మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, అనీషారెడ్డి

**పుంగనూరు :** అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ఏడాది పాలనలోనే ప్రజా విశ్వాసం కోల్పోయారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం మున్సి పాలిటీ, రూరల్ మండలాల్లో 'బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని వేల మందితో విడివిడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాక ఆయన ప్రజలను మోసగించడంలో కొత్తేమీ కాదన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం అంతా మోసాల తోనే సాగిపోతోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితం చేస్తే ఒక్కొక్కరూ తిరుపతి వెళ్లాలంటే మూడు జిల్లాల బస్సులు మారాల్సి ఉందన్నారు. ఇలాంటి ప్రయాణాలతో ఉపయోగం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి శ్రీకాకుళం నుంచి కుప్పం దాక ఉచిత ప్రయాణాలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసం కోల్పోయిందని, సూపర్–6లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమాటా, మామిడి, మిర్చి, పొగాకు రైతు లు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయి న రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న జగన్ మోహన్ రెడ్డి పర్యటనలకు ప్రజలను రానివ్వకుండా వేల మంది పోలీసులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ప్రజలను నియంత్రిస్తున్నారని మండిపడ్డారు. కానీ జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకం , అభిమానంతో ప్రజలకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వేల మంది తరలివచ్చి పర్యటనలను జయప్రదం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించి ఎప్పటికప్పుడు వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

### జగన్ ప్రజాభిమానం చూసి వణుకు
జగన్ సభలకు వస్తున్న ప్రజాభిమానం చూస్తుంటే కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోందని పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ నాయకుడు నూతనకాల్వ శ్రీనాథరెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దిన్ షరీఫ్, రాష్ట్ర యువత కార్యదర్శి కొత్తపల్లి చెంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో పాటు పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఇర్ఫాన్, అమరనాథరెడ్డి లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

### ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలి...
ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సూపర్–6ను అమలు చేయకపోవడం, మేనిఫెస్టోను పట్టించుకోకపోవడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రతి రోజు తెలియజేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో పాటు పార్టీ క్యాడర్ పూర్తిగా ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే సమాచారాన్ని ప్రజలకు వివరించాలన్నారు.



పుంగనూరు రూరల్ మండలంలో జరిగిన సభకు హాజరైన జనం

## నేడు సంకటహర గణపతి వ్రతం

**కాణిపాకం :** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం సంటక హర గణపతి వ్రతం జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఈ వ్రతం జరుగుతోందని చెప్పారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు.

## నేడు మొగిలిలో రాహుకేతు పూజలు

**బంగారుపాళెం :** మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొలని కోరారు.

## 16న విద్యుత్ గ్రీవెన్స్

**చిత్తూరు కార్పొరేషన్ :** వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీ రోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలను వినతి రూపంలో ఇవ్వాలని వివరించారు.

## సర్వ దర్శనానికి 24 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు ఆక్టోపస్ సర్కిల్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 92,221 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 42,280 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.51 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ మేరకు టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాయం కంటే ముందు వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.



# విద్యారంగం.. విధ్వంసం!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టింది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బంగారు బాటలు వేసింది. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత విద్యారంగాన్ని విధ్వంసం చేస్తోంది. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ గ్రామీణ విద్యార్థుల భవితను ప్రశ్నార్థకంగా మార్చేస్తోంది. అందులో భాగంగా విశ్వవిద్యాలయాల్లో పలు కోర్సులకు మంగళం పాడేసింది. అడ్మిషన్లు లేవనే సాకుతో మరిన్నింటిని తొలగించేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ పాలిటెక్నిక్‌ను పూర్తిగా రద్దు చేసేసింది. అలాగే యానిమల్ హస్బెండరీ కోర్సును సైతం చెల్లుచీటీ రాసేందుకు సన్నద్ధమవుతోంది. ఇక సాంకేతిక విద్యకు అధ్యాపకులను నియమించకుండా నిర్వీర్యం చేస్తోంది.

**కోర్సుల కోత.. కాలేజీల మూత!**

- యూనివర్సిటీలలో పలు కోర్సులకు మంగళం
- మరిన్నింటిని రద్దు చేసే యత్నంలో ప్రభుత్వం
- అగ్రి పాలిటెక్నిక్ కళాశాలలకు చెల్లిన కాలం
- సర్కారు వైఖరిపై విదార్థి సంఘాల ఆగ్రహం

**తిరుపతి సిటీ :** గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి విశ్వవిద్యాలయాలే దిక్కు. అయితే వర్సిటీల్లో పేద విద్యార్థులు అడ్మిషన్లు పొందే ఆర్ట్స్ గ్రూప్‌లను క్రమేణా కుదిస్తూ వస్తోంది. అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయంటూ మెర్జింగ్ పేరుతో పలు కోర్సులను ఇప్పటికే రద్దు చేసింది. ఈ ఏడాదిలో వర్సిటీలలో సుమారు 12 కోర్సులను తొలగించింది. టెక్నాలజీ పేరుతో ఏఐ, డేటా సైన్స్ అంటూ నూతన కోర్సులను ప్రవేశపెట్టినప్పటికీ బోధనకు నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో సాంకేతిక విద్య సైతం గాడి తప్పుతోంది.

### మూతపడిన వ్యవసాయ పాలిటెక్నిక్

గ్రామీణ వ్యవసాయ కుటుంబం నుంచి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంతో ఆసక్తితో చేరే వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సును పూర్తిగా తొలగించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేస్తూ ఎన్‌జీ రంగా వర్సిటీ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు నిరాశే మిగిలింది. అదే దారిలో వెటర్నరీ వర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ కోర్సుకు సైతం త్వరలో గండం పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రవేశాలు తక్కువగా ఉన్నాయనే నెపంతో పలు కోర్సులకు మంగళం పాడుతున్న ప్రభుత్వ వైఖరిపై అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు.

**నిర్వీరం చేసే కుట్ర**



వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుకు ప్రభుత్వం మంగళం పాడేసింది. ఇదే తరహాలో మరిన్ని కోర్సులను రద్దు చేసి కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేసేందుకు కుట్ర పన్నుతోంది. వర్సిటీలలో పెద్ద సంఖ్యలో మెర్జింగ్ పేరుతో పలు కోర్సులను రద్దు చేయడం దారుణం. – ఎస్.అక్బర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

**కోర్సుల రద్దు సరికాదు**



ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో ఇంత వరకు విడుదల చేయలేదు. విద్యార్థుల ప్రవేశాలు తగ్గుముఖం పట్టడంతో వర్సిటీలు దయనీయస్థితిలో ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టకుండా కోర్సులను రద్దు చేయడం సరికాదు. – ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్, తిరుపతి

**ఉన్నత విద్య దూరమవుతోంది**



ప్రభుత్వం కారణంగా గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోంది. అందుకే వర్సిటీలలో పలు కోర్సులను రద్దు చేసింది. వ్యవసాయ పాలిటెక్నిక్‌తో ఎంతో మంది గ్రామీణ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అలాంటి కోర్సులను రద్దు చేసి ఏకంగా కళాశాలలనే మూసివేయడం దారుణం. – ఆర్.ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

**ఆశగా ఎదురు చూశాం**



ఈ ఏడాది అగ్రి పాలిటెక్నిక్ కోర్సులో చేరాలని ఎంతో ఆశగా ఎదురు చూశా. మా సమీప బంధువు ఓ అమ్మాయి వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. నేను కూడా ఉద్యోగం సాధించి రైతులకు సేవ చేయాలనుకున్నా. కానీ ఈ ఏడాది తిరుపతిలో ఆ కోర్సును రద్దు చేశారని తెలిసింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. – సౌమ్య, విద్యార్థిని, తిరుపతి

**బాధగా ఉంది**



తిరుపతిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మా అబ్బాయిని చదివించాలని అనుకున్నాం. కానీ ఈ ఏడాది నుంచి కోర్సును పూర్తిగా ఎత్తివేశారని తెలిసి చాలా బాధగా ఉంది. వ్యవసాయ విద్యను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సును దూరం చేయడం తగదు. దీంతో వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. – రామయ్య, రైతు, తిరుపతి రూరల్

**భ్రష్టుపట్టించారు**



వర్సిటీలలో గ్రామీణ ప్రాంత పిల్లలు ఎంతో ఆసక్తితో చేరే ఆర్ట్స్ గ్రూప్‌లను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వ్యవసాయ విద్యను దూరం చేసే నిర్ణయాలు మంచివి కావు. వ్యవసాయ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు రద్దు చేసి మూసివేయడం దారుణం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారు. – మురళీధర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

# 'అయ్యో'ర్లకు జీతాల సమస్య

– పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల పూర్తయిన వెంటనే బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన టీచర్లకు కొత్త స్థానాల్లో జీతాలకు బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో ఎంఈఓలు అలసత్వం, పలు కారణాలతో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకొంది. నిబంధనల మేరకు బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన కొత్త స్థానంలో జాయిన్ అవుతూనే జీతాల బిల్లులను ట్రెజరీకి పంపించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. అయితే జిల్లా విద్యాశాఖ అధికారుల ఆ దిశగా పర్యవేక్షణ చేయకపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో టీచర్లు జీతాల బిల్లులను నమోదు చేసుకోలేని పరిస్థితి దాపురించింది. గతంలో విధులు నిర్వహించిన రోజులకు పాత పాఠశాలలో, బదిలీ పొంది జాయిన్ అయిన తేదీ నుంచి కొత్త పాఠశాలలో జీతాలు పొందాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ఎల్‌పీసీ లను టీచర్లు ఎంఈవోలకు అందజేస్తే వాటి ఆధారంగా అరియర్ బిల్లులను ప్రతి నెలా 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ట్రెజరీ అధికారులకు పంపేలా చర్యలు చేపట్టాలి. కొన్ని మండలాల్లో జీతాల మంజూరునకు డ్రాయింగ్ అథారిటీ ఉన్న ఎంఈవో–1 సెలవులో ఉండటం, కొందరు ఉద్యోగ విరమణ పొందడం, మరికొందరు ఇంచార్జీలుగా ఉండటం ఇలాంటి కారణాలతో నిర్ణీత సమయంలో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకుంది. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టి ఎంఈవోలకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని బాధిత టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

### పొజిషన్ ఐడీలు లేక సమస్య

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అనేక ఆదర్శ ప్రాథమిక (మోడల్ ప్రైమరీ) పాఠశాలలకు వందల సంఖ్యలో టీచర్లు ఉద్యోగోన్నతి పొంది హెచ్‌ఎంలుగా నియమితులయ్యారు. ఇంత వరకు బాగానే ఉండగా వారికి ఇప్పటి వరకు పొజిషన్ ఐడీలు ఇవ్వని పరిస్థితులున్నాయి. ఆ ఐడీలు లేకపోవడంతో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకొంది. బిల్లులు సమర్పించే గడువు ఈనెల 10వ తేదీతో ముగియడంతో ఐడీల కోసం ఎదురు చూసిన ఆ హెచ్‌ఎంల ఆశలు ఆవిరయ్యాయి. అదే విధంగా చిత్తూరు జిల్లాలోని నింద్ర ఎంఈవో–1 వ్యక్తిగత కారణాలతో గత నెల 25వ తేదీ నుంచి సెలవులోకి వెళ్లారు. ఆ స్థానంలో మరో అధికారిని నియమించకపోవడంతో జీతాల సమస్య ఏర్పడింది. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగలో ఎంఈవో ఉన్నా పలు సమస్యలతో బదిలీ టీచర్లకు జీతాల బిల్లులు సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి జీతాల బిల్లుల నమోదుకు గడువు పొడిగించి న్యాయం చేయాలని బాధిత హెచ్‌ఎంలు, టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

# కొండంత జనం



బోయకొండ ఆలయం వద్ద వాహనాల రద్దీ

- కిక్కిరిసిన బోయకొండ ఆలయం
- రద్దీగా మారిన క్యూలు

**చౌడేపల్లె :** కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరుగాంచిన బోయకొండ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం న కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామున 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండపై ఎటుచూసినా భక్తజన సందోహం నెలకొంది. అమ్మవారిని బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయంలోని క్యూలైన్లు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. గంటల తరబడి నిరీక్షించి భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. సుమారు 50 వేల మందికిపైగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఊహించని రీతిలో వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.



ప్రధాన ఆలయం నుంచి ముఖద్వారం వెలుపలి వరకు క్యూలో నిలబడిన భక్తజనం

**బోయకొండ ఒక్క రోజు ఆదాయం రూ.28.60 లక్షలు**

బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం ఒక్కరోజు మాత్రమే రూ:28.60 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఆలయంలో భక్తులకు విక్రయించిన వివిధ రకాల సేవా టికెట్లు, ప్రసాదం, తీర్థం టికెట్లు ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు.

# కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం

- టైరు పేలి కారు బోల్తా
- ప్రాణాలతో బయటపడిన కుటుంబ సభ్యులు

**బంగారుపాళెం :** మండలంలోని పాలేరు ఫ్లై ఓవర్ సమీపం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు టైరు పగిలి బోల్తా పడి దగ్ధమైంది. ఈ సంఘటనలో కాంచీపురానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు గాయాలతో బయటపడి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన తాండవమూర్తి (65)కి బైరెడ్డిపల్లె మండలంలోని విరుపాక్షపురంలోని ఆయుర్వేద వైద్యశాలలో నాటు మందు తాగించుకుని వచ్చేందుకు కుమారుడు కార్తికేయన్(34), తల్లి సంపత్‌కుమారి(60), భార్య అశ్వని(32), కుమార్తె రక్షిత(2), మామ వేలాయుధం(45) మొత్తం ఆరుగురు కలిసి ఉదయం 4.45 గంటలకు కాంచీపురం నుంచి తమ సొంత కారులో బయలుదేరి విరుపాక్షపురానికి 8 గంటలకు చేరుకున్నారు. అక్కడ తాండవమూర్తికి నాటుమందు తాగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యలో బంగారుపాళెం మండలం పాలేరు ఫ్లై ఓవర్‌కు కొంతదూరం వెళ్లిన తరువాత కారు టైరు పగిలి అదుపు తప్పి జాతీయ రహదారిపై బోల్తా పడడంతో మంటలు చెలరేగాయి. కారుకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. కారులో ఉన్న వారు డోర్ తెరుచుకుని దూకేసి ప్రాణాలతో బయటపడ్డారు. కారు నడుపుతున్న కార్తీకేయన్, అతడి భార్య అశ్వనికి, మామ వేలాయుదానికి గాయాలయ్యాయి.



గాయపడిన వారిని 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు మంటలను అదుపు చేసేందుకు కోసం పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి రెడ్డెప్పరెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేలోగా కారు పూర్తిగా కాలిపోయింది. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### తప్పిన ప్రాణాపాయం

కారు టైరు ఉన్న ఫలంగా పగిలిపోవడంతో అదుపు తప్పి కారు బోల్తాపడి మంటలు చెలరేగాయని అక్కడ ఉన్న స్థానికులు తెలిపారు. కారులో ఉన్నవారు తేరుకుని డోర్లు తెరుచుకుని బయటకు వచ్చారని తెలిపారు. కొంతసేపటికే కారు పూర్తిగా దగ్ధమైందన్నారు. కారు డోర్లు తెరుచుకోకపోయి ఉంటే కారులోని వారు చనిపోయి ఉంటారన్నారు.

## లైంగిక దాడికి యత్నం

**చౌడేపల్లె :** ఇల్లు కట్టించడంతో పాటు అన్నీ తానై చూసుకుంటానని అసభ్యకరంగా మాట్లాడుతూ.. లైంగిక దాడికి యత్నించాడని కాగతి పంచాయతీ పలగార్లపల్లెకు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదంటూ ఆదివారం ఆమె కన్నీటి పర్యంతమైంది. బాధితురాలి కథనం.. పలగార్లపల్లెకు చెందిన గంగరాజుకు ప్రాజెక్టు సమీపంలోని ఊదరకుంట వద్ద వ్యవసాయ పొలం ఉంది. ఈనెల 11వ తేదీనా ఆమె తన భర్త గంగరాజు పొలం వద్ద ఉండగా మధ్యాహ్నం అన్నం తీసుకొని బయలు దేరగా మార్గ మధ్యలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. లైంగిక దాడికి యత్నించగా కేకలు వేయడంతో పరారైనట్లు పేర్కొంది. ఈ ఘటనపై అదే రోజు రాత్రి వెళ్లి అడగ్గా తన అనుచరులతో కలిసి శ్రీనివాసులు తనతో పాటు తన భర్త కుటుంబీకులపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈనెల 12 వతేదీ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వారి నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు.

## ఆర్థిక కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

**చిత్తూరు అర్బన్ :** కుటుంబ ఆర్థిక కారణాలు వేధించడంతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు చిత్తూరు నగరం లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఇన్నానాథన్(58) శనివారం సాయంత్రం కుటుంబీకులకు గిరింపేట వరకు వాకింగ్ వెళుతున్నానని చెప్పాడు. తీరా క్రిష్ణవేణి కళాశాల ప్రాంతంలో పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు, కుటుంబీకులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. కాగా భార్య షీలా కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆర్థిక కారణాలతో మృతుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## లారీ బీభత్సం - మామిడిచెట్లు ధ్వంసం

**గుడిపాల :** రోడ్డుపైన వెళ్తూ ఓ లారీ అదుపు తప్పడంతో వ్యవసాయ పొలంలోకి వెళ్లి పొలం పక్కన ఉన్న రాతి కూసాలను ఢీకొంటూ మామిడి చెట్లను ధ్వంసం చేసింది. బెంగుళూరు నుంచి తమిళనాడులోని నామక్కల్‌కు వెళ్తున్న లారీ డ్రైవర్ మద్యం తాగి మద్రాస్ క్రాస్ రోడ్డు వద్ద జ్యోతీశ్వర్‌రెడ్డికి చెందిన రైతు మామిడితోటలోకి లారీని వదిలేశాడు. ఎదురుగా ఎవ్వరూ రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో వ్యవసాయ పొలంలోకి ప్రవేశించి రాతి కూసాలు ధ్వంసం కావడంతో పాటు మామిడిచెట్లు ధ్వంసం అయ్యాయి.



ధ్వంసమైన మామిడి చెట్లు

## ఎయిడెడ్‌లో టీచర్ల నియామకాలకు పచ్చజెండా

– ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ప్రభుత్వం నూతన నిబంధనలను రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కొత్త నిబంధనలను రూపొందించారు. గతంలో నిర్వహించే ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేశారు. 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించనున్నారు. మెరిట్ ప్రాతిపదికన టీచర్లను ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక విధానానికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖకు చేరాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 11 ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

### స్టాఫ్ సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీ


ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీ స్టాఫ్ సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కమిటీలో ఎడ్యుకేషనల్ ఏజెన్సీ ప్రెసిడెన్స్ లేదా ఆయన ప్రతినిధి, హెచ్ఎం, ఇద్దరు సబ్జెక్ట్ నిపుణులను విద్యాశాఖకు సంబంధించిన డీవైఈవో కేడర్ అధికారితో కూడిన స్టాఫ్ సెలెక్షన్ కమిటీ పోస్టులకు అర్హులను ఎంపిక చేయనుంది. ఈ ప్రక్రియ కు సంబంధించి జిల్లాలో ఎక్కువగా సర్క్యులేషన్ ఉన్న రెండు దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఆస్కారం లేదు. 100 మార్కుల్లో 80 మార్కులకు సీబీటీ పరీక్ష, మిగిలిన 20 మార్కులకు ఏపీ టెట్‌లో సాధించిన మార్కులకు వెయిటేజీ ఇస్తారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న వారికి ఐదు మార్కులు వెయిటేజీ కల్పిస్తారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి మూడేళ్ల వయో పరిమితి సడలింపు ఉంటుంది. అన్ ఎయిడెడ్ పోస్టులను కమిటీ ఆధ్వర్యంలోనే ఎంపిక చేస్తారు. ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీని ప్రకటించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నిరాశ్రయుల వసతి గృహం తనిఖీ

**చిత్తూరు అర్బన్ :** రాష్ట్రంలోని నిరాశ్రయుల గృహాల్లోని పేదలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి మెప్మా తరపున సహకారం అందిస్తామని రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ పేర్కొన్నారు. చిత్తూరులోని నిరాశ్రయుల వసతి గృహాన్ని శనివారం రాత్రి మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ తనిఖీ చేశారు. వంట శాలలో ఆహార పదార్థాల తయారీ, నిత్యావసర సరుకులు తేదీలను, వసతి పొందుతున్న వారి రికార్డులను పరిశీలించారు. అనంతరం వసతి పొందుతున్న వారి నుంచి లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ , మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రానికి, కొన్ని వసతులు కోరారని, పరిశీలించి సమకూర్చుతామన్నారు. సపోర్ట్ సంస్థ నిర్వాహకులు జోసఫ్ రాజు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఎస్ఎమ్ ఎమ్ మెప్మా శ్రీనివాసరావు , చిత్తూరు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, సీఎంఎం వెంకటరమణ, టీఈఎస్ఎస్ రవి, మెప్మా పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. కాపర్ తీగలు చోరీ

**చౌడేపల్లె :** కాపర్ వైర్ల కోసం వేర్వేరు ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని చారాల, శెట్టిపేట సమీపంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చారాల సచివాలయం పక్కన బీఎస్ఎన్ఎల్ టవర్ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మను , పగులకొట్టి కాపర్‌వైరు చోరీ చేశారు. అలాగే శెట్టిపేట సమీపంలోని పురుషోత్తం రాజు మామిడి తోటలో టవర్ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ తీగలను అపహరించారు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. చోరీలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



సచివాలయం పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం